1
నవతెలంగాణ
ఆదిలాబాద్
శుక్రవారం | అక్టోబర్ 13, 2023 | www.navatelangana.com

## ఉచిత కంటి అద్దాల పంపిణీ

నవతెలంగాణ-జైనథ్



మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలోని ఎల్వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రంలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవ సందర్భంగా పేద ప్రజలకి ఉచిత కంటి పరీక్షలు చేసి అద్దాలని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజన్ టెక్నీషియన్ సాయికృష్ణ మాట్లాడుతూ పేద ప్రజలకు ఎల్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో కంటి అద్దాలని ఉచితంగా అందించడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రతిరోజు కంటి పరీక్షలను ఉచితంగా చూడటం జరుగుతుందని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఎల్వీ ప్రసాద్ ఇన్స్టిట్యూట్‌ని సంప్రదించాలని తెలిపారు.

## పల్సిని మండలంగా ప్రకటించాలని వినతి

నవతెలంగాణ-కుభీర్

పల్సిని మండలంగా ప్రకటించాలని గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని పల్సి గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో పల్సి గ్రామం నుంచి కుభీర్ తహసీల్దార్ కార్యాలయం వరకు గ్రామస్తులు భజన కార్యక్రమాన్ని చేపడుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దీంతో వారు మాట్లాడుతూ పల్సిని మండలంగా ఏర్పాటు చేసేంత వరకు ఈ సమ్మెలు, నిరాహార దీక్షలు చేపడతామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజేష్, తోకల రాములు, విలాస్, యువజన సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## నేటి నుండి సెలవులు షురూ..
## ఇంటికెళ్తున్న విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో అన్ని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలకు శుక్రవారం నుంచి దసరా సెలవులు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఆయా వసతి గృహాల్లో వుండే విద్యార్థులు ఇంటికి పయణమైతున్నారు. బుధవారంతో వారికి పరీక్షలు పూర్తవ్వగా బడికి, జూనియర్ కళాశాలకు బైబై చెప్తున్నారు. కాగా సెలవులలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆయా పాఠశాలల యాజమాన్యాలు సూచిస్తున్నారు. తోటి విద్యార్థులతో చేతులు కలిపి బైబై చెప్పుకుంటూ ఆనందంతో తమ ప్రత్యేక వాహనాలలో ఇంటికి వెళ్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి వారికి సంబంధించిన సమాన్ల సర్ది వారిని ఇంటికి తీసుకెళ్తున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణమంతా సందడి సందడిగా మారింది. అటు బస్టాండ్‌లోను రద్దీ పెరిగి కిటకిటలాడింది.

## టీఎన్జీఓ నుంచి సీఐటీయూలో చేరిక




నవతెలంగాణ- ఖానాపూర్

ఖానాపూర్ పట్టణ కేంద్రంలోనీ విద్యానగర్ అంగన్‌వాడీ కార్యకర్త మునీంద్ర, ఆయా వెంకటమ్మలు గురువారం టీఎన్జీఓ సంఘం నుంచి సీఐటీయూ సంఘంలో చేరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ వీరికి కండువా కప్పి ఆహ్వానించారు. అంగన్‌వాడీ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూ సంఘంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అంగన్‌వాడీ కార్యకర్త మునీంద్ర అన్నారు. ఇప్పటికే గత 24 రోజుల నుంచి సమ్మె చేసి అంగన్‌వాడీ టీచర్ల ఆయాల సమస్యలు పరిష్కరించే ఘనత సీఐటీయూకే ఉందని అన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. గురువారం మండలంలోని బీంసరి, లాండసాంగి, గ్రామాల్లోని రైతు వేదికల్లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై వివరించారు. ప్రతి ఒక్క చట్టం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత మీపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీంసరి, లాండసాంగి గ్రామాల సర్పంచ్‌లు మయూరి చంద్ర, అంకత్ శ్రీనివాస్, న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉమ్రి, రుయ్యాడి, పల్లి(కె) గ్రామాలకు చెందిన పలువురు మహిళలు, పురుషులు, యువకులు బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నా, సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కేదారీశ్వర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గంగాధర్, శంకర్, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జీవన్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, కార్యకర్తలు, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రేమేందర్

నవతెలంగాణ-తలమడుగు

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గొంటి ముక్కుల ప్రేమేందర్‌ను గురువారం ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ మాట్లాడుతూ నమ్మకంతో నన్ను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, చిన్నన్న, మోహన్, గంగాధర్, బక్కన్న, రామన్న, ప్రసాద్, గంగన్న, రాజు, రామెల్లి శివ పాల్గొన్నారు.

# విస్తృత తనిఖీలు.. నగదు, మద్యం పట్టివేత



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తయ్యారు. ఎక్కడిక్కడ వాహనాలు తనిఖీలు చేస్తూ ఎటువంటి ఆధారాలు లేని డబ్బులు, అక్రమ మద్యం స్వాధీనం చేసుకుంటున్నారు. బెల్టు షాపులపై దాడులు నిర్వహిస్తు మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. గురువారం ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో సీఐ సత్యనారాయణ తనిఖీలను నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తూ సరైన ఆధారాలు లేని నగదును పట్టుకొని ఆధారాలు చూపించగా పరిశీలించి వదిలేస్తున్నారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన ఏనుగు కార్తీక్ అనే వ్యక్తి కారులో మద్యం తరలిస్తుండగా పట్టుబడింది. ఆయనపై కేసు నమోదు చేసి కారు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందుకు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం ఈ తనిఖీలు జిల్లాలో విస్తృతంగా చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. ఎన్నికల నిబంధనలను అందరూ పాటిస్తూ సహకరించాలని కోరారు.

**షాపుల్లో మద్యం అమ్మకం.. ఐదుగురిపై కేసు...**

పట్టణంలోని కుమ్మరికుంట కాలనీలో రమేష్, సాయికుమార్ కిరణషాపులో, శ్రీరామ్ కాలనీలో శంకర్ కూరగాయల షాపులో, కొత్త కుమ్మరి వాడలో దిలీప్ కిరణ్ షాపులో, కుమ్మరి కుంట కాలనిలో రాజేశ్వర్ కిరణషాపులో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టగా వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు నవీన్, ఖలీం ఉన్నారు.

**ద్విచక్ర వాహనాలపై లక్షల నగదు తరలింపు..**

వాహనాల తనిఖీల్లో బ్రాహ్మణవాడకు చెందిన అనురాగ్ అనే వ్యక్తి అంబేద్కర్ చౌక్‌లో ద్విచక్ర వాహనం మీద ఒక బ్యాగ్‌లో రూ.6లక్షల నగదు పట్టుకెళ్తుండగా పట్టుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. అలాగే బేల మండలం సలాయి తాండకు చెందిన రాంలాల్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం మీద రూ.లక్ష 47 వేలను పట్టుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ చౌక్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా మహాలక్ష్మీవాడకు చెందిన విజయ్‌కుమార్ కారులో రూ.లక్ష 23వేల 710 నగదు తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరి నగదును సీజ్ చేసి పంచనామా ద్వారా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎంపీడీఓకు అప్పజెప్పినట్లు తెలిపారు. సరైన ఆధారాలు చూపిస్తే నగదు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై ఉదయ్ కుమార్ ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఆర్జీయూకేటీ విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ విద్యార్థులకు గురువారం ఇన్నోవేటెడ్ ఆర్జీయూకేటీ ఈ సెల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌లోని ఐటీ టవర్‌లో హైదరాబాద్ ఐఐటీకి చెందిన సలహాదారులు వెంకట్, శ్రీధర్, మెట్టె ఎంటర్‌ప్రెన్యూర్, ఇండస్ట్రీ ఇన్నోవేటర్ రెడ్ సిగ్నల్స్ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక విద్యార్థులు మంచి కమ్యూనికేషన్, మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. విజయవంతమైన వ్యాపార వ్యవస్థాపకులుగా ఎదగాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి కష్టపడి అంకితభావంతో పని చేయాలని అన్నారు. సంకల్పంతో తమ సంస్థను ఎలా నిర్మించాలో ఇన్ఫోసిస్ మెంటార్ నారాయణమూర్తి , ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధా మూర్తి నుంచి పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఈ సెల్ కన్వీనర్ రాకేష్‌రెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని విజేత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం ఎన్నికల నిర్వహనపై అవగాహన కల్పించారు. పాఠశాల లీడర్స్‌ను 6 రంగాల్లో ఎన్నుకున్నారు. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ చీఫ్ ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు సాధారణ ఎన్నికలను పరిచయం చేసే విధంగా ఎన్నికల ప్రక్రియ చేపట్టామన్నారు. ఇదే క్రమంలో పదవుల కేటాయింపులో బాలురు బాలికలకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ఎన్నికల విషయానికొస్తే ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు కొనసాగించనున్నారు. సాధారణ ఎన్నికల తరహాలోనే ఓటర్ లిస్ట్ ప్రకటన, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ సందర్భంగా గుర్తింపు కోసం ఓటరుకు ఇంక్ మార్క్ వేయుట, రహస్య ఓటింగ్ నిర్వహణకు బ్యాలెట్ బాక్స్ వినియోగం వంటి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఇదే క్రమంలో ఎన్నికల ప్రచారం కోసం రంగంలో ఉన్న అభ్యర్థులకు తగు సమయాన్ని కేటాయించామని అన్నారు. ఆ తరువాత ఉపాధ్యాయుల పర్యవేక్షణ, నిఘాల మధ్య పోలింగ్ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. స్కూల్ నాలెడ్జ్ లీడర్ శ్రీతులసి, స్వచ్ఛ భారత్ లీడర్‌గా అర్పా మహేవిష్, కమ్యునికేషన్ లీడర్‌గా విహారి, స్పోర్ట్స్ లీడర్‌గా షేక్ నేహాల్, కల్చరల్ లీడర్‌గా రోహిత్ గౌడ్, ఇన్నోవేషన్ లీడర్‌గా షేజల్ దత్త ఎన్నికయ్యారు. ఇలాంటి ఎన్నికల ద్వారా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. అనంతరం బాలికలు బతుకమ్మలతో సందడి చేశారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యాప్‌ల నిర్వాహణపై అవగాహన కలిగి ఉండాలి




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సి-విజిల్, సువిధ యాప్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సి-విజిల్, సువిధ యాప్‌ల నిర్వహణపై సంబంధిత అధికారులకు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సి-విజిల్, సువిధ యాప్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అంతకుముందు ఈ-డిస్ట్రిక్ మేనేజర్ యాప్‌లపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పోలీస్, ఎస్ఎస్‌టి సర్వెలెన్స్ బృందాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలీస్, ఎస్ఎస్‌టి సర్వెలెన్స్ బృందాలు జిల్లాలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ప్రజలు ఎన్నికల కోడ్ ముగిసే వరకు రూ.50 వేల వరకే నగదు తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు తీసుకు వెళ్లినట్లైతే సరైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. పట్టుబడిన నగదు, వస్తువుల విడుదల చేసేందుకు వచ్చిన పిర్యాదులు, దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. రూ.10 లక్షలు, ఆపై కంటే ఎక్కువ నగదు స్వాధీనంపై ఇన్‌కం టాక్స్ శాఖకు సమాచారం అందించాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీఓ స్రవంతి పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగం సాధించిన యువకులకు సన్మానం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని సొనారి గ్రామానికి చెందిన ఈర్ల అన్వేష్, బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించారు. అదేవిధంగా భోజన్న అనే యువకుడు ఏఆర్‌లో ఉద్యోగం సాధించాడు. దీంతో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఉద్యోగం సాధించడంతో వారిని గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఇద్దరు యువకులు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని అన్నారు. గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రామంలోని యువకులు వారిని ఆదర్శంగా తీసుకోని మరిన్ని ఉద్యోగాలు సాధించాలన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గోదావరిలో మహిళ మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బాసర

గోదావరిలో గురువారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... గోదావరి బ్రిడ్జి పిల్లర్ సమీపంలో మృతదేహం ఉన్నదన్న సమాచారం మేరకు స్థానిక గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయగా మృతురాలి వయసు(40) వరకు ఉంటుందని, చేతికి మట్టి గాజులు, గోధుమ రంగు నైటీ ధరించి ఉంది. ఇతర ఆధారాలు లభించలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని జిల్లా ఎస్పీ కె సురేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. సివిల్, ఏఆర్ విభాగాలలో ఉద్యోగం సంపాదించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలతో కూడిన డాక్యుమెంట్ గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన మూడు సెట్లను, ఆరు ఫోటోలను, ప్రతి జిరాక్స్‌పై స్వీయ ధృవీకరణతో జిల్లా పోలీసు హెడ్ క్వాటర్స్‌లో అధికారులకు సమర్పించారు. సివిల్‌లో 107, ఏఆర్ విభాగంలో 73 అభ్యర్థులు ఉద్యోగాన్ని సంపాదించారన్నారు. సివిల్‌లో నలుగురు అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. శుక్రవారం ఫైర్ కానిస్టేబుల్, టీఎస్ఎస్పీ, మిగిలిన ఉద్యోగాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు.

## బాతులు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి

నవతెలంగాణ-బెజ్జూర్

చెరువులో బాతులు పట్టేందుకు వెళ్లి ఒకరు నీటిలో మునిగి మృతిచెందిన సంఘటన మండలంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గురువారం ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన మడె శంకర్(50) అనే వ్యక్తి బుధవారం సాయంత్రం కాటేపల్లి సమీపంలోని ఊరకుంట చెరువులో బాతులను పట్టేందుకు మడి శంకర్ వెళ్లి చెరువులో మునిగిపోయాడు. మృతుడి భార్య రాజక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

## బాధిత కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని వెల్గీ గ్రామ పంచాయతీ పరిధిలో గల కెడెగావ్, మన్నెగూడెం గ్రామానికి చెందిన గెడం పద్మాభాయి ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సాగర్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు 50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతిరాలి కుటుంబానికి అండగా ఉంటామని బరోసా కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ధన్‌రాజ్, హోంగార్డు బలరాం ఉన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉంటా

- పీసీసీ సభ్యుడు కోరళ్ల కృష్ణారెడ్డి

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను బరిలో ఉండబోతున్నానని పీసీసీ సభ్యుడు కోరళ్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్లుగా స్థానికంగా ఉంటూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ చేపట్టిన ప్రతీ కార్యక్రమం విజయవంతం చేశానన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా సిర్పూర్ నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటు వారి సమస్యలపై ఉద్యమించామన్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఆరు గ్యారంటీలు ఒక్కటే మార్గమని ఆశాభావంతో ఉన్నానని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ని ఓడించే సత్తా తనకు మాత్రమే ఉందన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే సిర్పూర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, శైలేష్, తిరుపతి, నీరంజన్ పాల్గొన్నారు.



## విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని సింగరేణి హైస్కూల్లో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి స్కూల్ విద్యార్థులు(స్కౌట్స్ అండ్ గైడ్స్)లో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ ముందుండాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. చిన్నారులు పలు రకాల పువ్వులతో పేర్చిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులు సంతోష్, రవితేజ, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్, సృజన కుమారి పాల్గొన్నారు.




## రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కౌటాల



సికింద్రాబాద్‌లోని బొల్లారంలో నిర్వహించిన నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో కుమురంభీం జిల్లా కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నెట్ బాల్ పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల విభాగంలో ఎన్ సరస్వతి(పదో తరగతి), ఎ.వెన్నెల(పదో తరగతి), ఎల్.శ్రావణి(పదో తరగతి), బాలుర విభాగంలో కె.నవీన్(పదో తరగతి), బి.విగ్నేశ్వర్(పదో తరగతి), ఎస్ఎస్ శ్రీకాంత్(తొమ్మిదో తరగతి), కే.అక్షయ్(పదో తరగతి), డి ప్రశాంత్(ఏడో తరగతి) జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో జరిగిన నెట్ బాల్ పోటీలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తచాటారు. విద్యార్థులను జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణసింగ్ చేతులమీదుగా గురువారం ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | అక్టోబర్ 13, 2023 | www.navatelangana.com

## గ్రామాల్లో కొనసాగుతున్న వైద్యశిబిరం



**నవతెలంగాణ-నార్నూర్**

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యశిబిరం కొనసాగుతున్నాయి. గురువారం మండల కేంద్రంలోని దుర్గానగర్‌తో పాటు తాడిహత్నూర్, బేతాల్‌గూడ, గుండాల, భీంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరంలో హెల్త్ సూపర్ వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది జంగుబాయి, నరేందర్, సుశీల, సింధు, ఆశాలు సంగీత, అనిత, పంచుబాయి ఉన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు మృతి

**నవతెలంగాణ-దిలావర్‌పూర్**



ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం నర్సాపూర్(జి) మండలంలోని బామ్ని తండ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... రాథోడ్ యువరాజ్(12) గ్రామంలోని పాఠశాలలో బతుకమ్మ సంబురాలు చూడటానికి వెళ్లాడు. ఆ ప్రాంతంలో పెండమాల్ల నితీష్ టీఎస్16యూటీ7193 నెంబరు గల మహేంద్రం సుప్రో బైక్‌ను పార్క్ చేశారు. ముధోల్ల ముత్యం అనే వ్యక్తి అతనికి చెప్పకుండా ఆబైక్‌ను తీసుకొని బయలుదేరాడు. పాఠశాలకు దగ్గరలో ఉన్న కిరాణ దుకాణంలోకి వెళ్తున్న యువరాజ్‌ను ఢీకొట్టగా బాలుడు అక్కడిక్కడే మృతిచెందాడు. అక్రమంగా బైక్‌ను తీసుకెళ్లి ఢీకొట్టి బాలుని మృతికి కారకుడైన వ్యక్తిపై తండ్రి రాథోడ్ రామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలు



ఉట్నూర్‌లో..



ఆదిలాబాద్ రూరల్‌లో..

**నవతెలంగాణ-దిలావర్‌పూర్**

మండల కేంద్రంలోని విజేత స్కూల్‌లో గురువారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పువ్వులతో బతుకమ్మను పేర్చి పూజలు చేశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేయడం అందరినీ అలరించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజిత మాట్లాడుతూ ప్రతీ ఏటా దసరా సెలవులు ప్రారంభమయ్యే, ముందురోజు పాఠశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. చిన్నారులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ ఆట పాటలతో బతుకమ్మ పండుగ నిర్వహించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుఖేష్, నవీన్, సతీష్, రాజశేఖర్, చంద్రకళ, నాగమణి, సుష్మిత, ప్రతిభ, సుమలత, నిఖిల, శరణ్య, నిఖిత, విజయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**కడెం :** మండల కేంద్రంతో పాటు అంబారిపేట్ ప్రభుత్వ పాఠశాల, కేరళ మోడల్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ పండుగ సంబురాలను నిర్వహించారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినీక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులు కలిసి వివిధ రకాల పువ్వులతో బతకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు మధ్య బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బతుకమ్మ సంబురాలు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించుకున్నారు. దీంతో పాఠశాల పరిసరాల ప్రాంతాల్లో పూర్తిగా పండుగ వాతావరణం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**ముధోల్ :** మండలకేంద్రంలోని రబింద్రా, అక్షర, శిశు మందిర్, పాఠశాలలతో పాటు మండలంలోని శ్రీవిద్య ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్, భాష్యం పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో, గీర్వాణి కళాశాలలో గురువారం ఘనంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలు సేకరించి, విద్యార్థులు బతుకమ్మలను పేర్చారు. సంస్కృతి సాంప్రదాయలు ఉట్టిపడే విధంగా పాటలు పాడుతూ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రిన్సిపాల్‌లు, డైరెక్టర్‌లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఉట్నూర్ :** సంస్కృతి, సాంప్రదాయలను కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ సంగీత అన్నారు. గురువారం బతుకమ్మ పండుగ సంబురాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తోటి అధ్యాపకురాలు డాక్టర్ శ్రావణి, శ్రీధర, శ్వేత, స్వప్న, యోగలక్ష్మి, విద్యార్థునులతో బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తు ఘనంగా నిర్వహించారు. అనంతరం డాక్టర్ సంగీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉన్నారు.

**జైనథ్ :** మండల కేంద్రంలోని వాగ్దేవి ప్రైమరీ పాఠశాలలో గురువారం విద్యార్థులు ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉష్కమల్ల లింగన్న మాట్లాడుతూ శుక్రవారం నుండి దసరా సెలవులు ప్రకటించడంతో ముందుగానే బతుకమ్మ సంబురాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. దీనివలన విద్యార్థులకు తెలంగాణ సంస్కృతిని, సాంప్రదాయాలను గూర్చి తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు.

**తలమడుగు :** దసరా, నవరాత్రుల సందర్భంగా రేపటి నుంచి పాఠశాలలకు 13 రోజులు సెలవులు ప్రభుత్వం ప్రకటించడంతో గురువారం ఖోడద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, మహిళా ఉపాధ్యాయురాలు సురేఖ, మమతల ఆధ్వర్యంలో విద్యార్థులు బతుకమ్మలను పేర్చి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పాటలపై ఆడి పాడారు. తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు విశేష ప్రాధాన్యత ఉన్న కారణంగా బతుకమ్మ విశిష్టతను విద్యార్థినులకు తెలియజేశారు.

**నార్నూర్ :** మండలంలోని జామడ ఆశ్రమ, సైన్స్ మోడల్ బాలికల పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు రంగు రంగుల పువ్వులు తెచ్చి బతుకమ్మను తయారు చేసి బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. అనంతరం సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌహాన్ నెహ్రూ, ఉపాధ్యాయ సిబ్బంది ఆడే విశ్వనాథ్, రాథోడ్ హరిచంద్, పుష్పలత, ప్రేమ్ కుమార్, జాదవ్ శివాజీ, ఆడే కైలాష్, గంగాధర్, చంపావతి, మల్కు, రజనీకాంత్, రాజ్యలక్ష్మి, రవీందర్, ముక్తా, భారతాబాయి, జనాబాయి ఉన్నారు.

**ఆదిలాబాద్‌రూరల్ :** మావల మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో వాఘాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఆర్.నారాయణ, ప్రారంభించి, విద్యార్థినులు ఎంతో ఉత్సాహంతో రంగురంగుల దుస్తులతో పాఠశాల ప్రాంగణంలో అందమైన రంగవల్లులతో తిరొక్క పువ్వులతో బతుకమ్మను తీర్చిదిద్ది, విద్యార్థినులు బతుకమ్మ పాటలతో ఆడి పాడి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ బృందం పి.నాగేంద్ర, సీహెచ్. రమేష్‌బాబు, ప్రతాప్, ప్రవీణ్, ప్రేమ్ సింగ్, రవీందర్, పార్వతి, విద్యార్థినులు స్థానికంగా ఉన్న వాగులోకి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

**ఆదిలాబాద్‌టౌన్ :** ఆదిలాబాద్ పట్టణంలోని ఆదర్శ్ నగర్‌లోని ధర్మ విద్యాలయంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు బతుకమ్మ ఆడుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ సోహన్ సింగ్ చాహెల్, ప్రిన్సిపాల్ స్వప్నలత, కోఆర్డినేటర్ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్‌లో..




నార్నూర్‌లో..

## సివిల్, ఏఆర్ అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

జిల్లాలో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ పరిశీలన కొనసాగుతుందని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రక్రియను ఎస్పీ పరిశీలించారు. సివిల్, ఏఆర్ విభాగాల్లో ఉద్యోగం సంపాదించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలతో కూడిన డాక్యుమెంట్ గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన మూడు సెట్లు, ఆరు ఫోటోలను, ప్రతి జిరాక్స్‌పై స్వీయ ధృవీకరణతో జిల్లా పోలీసు హెడ్ కోటర్స్‌లో అధికారులకు అందజేశారు. జిల్లాలో సివిల్‌లో 149 ఏఆర్ విభాగంలో 84 మంది ఉద్యోగాలు సాధించారు. సివిల్‌కి సంబంధించిన నలుగురు అభ్యర్థులు ఏఆర్‌కి సంబంధించిన ఒక అభ్యర్థి గైర్హాజరయ్యారు. శుక్రవారం కానిస్టేబుల్, ఫైర్ కానిస్టేబుల్, టీఎస్ఎస్పీ, మిగిలిన ఉద్యోగాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారులు సంజీవ్ కుమార్, మురళి, ఆశన్న, ప్రసాద్, హెడ్ క్వార్టర్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గడప గడపకు ఆరు గ్యారంటీలు



**నవతెలంగాణ-కడెం**

పేదల బతుకులు మారాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. రైతులకు ఉచిత కరెంటు, రూపాయి కిలో బియ్యం, ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ పక్క ఇల్లు, పింఛన్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సు, పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి, ఎన్నో గొప్ప ప్రతిష్టాత్మకమైన పనులను కాంగ్రెస్ హయాంలో చేపట్టిందన్నారు. రాబోయే రోజులలో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పడిగెల భూషణ్, పాండ్వాపూర్ గ్రామాధ్యక్షుడు తుమ్మల ప్రతాప్, మల్లయ్య, రాజన్న, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ప్రయాణించి, బహుమతులు పొందాలి

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త ప్రకటిస్తున్నట్టు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21, 22, 23, 28, 29, 30వ తేదీల్లో ప్రయాణం చేసే వారికి పారితోషకం రూ.11 లక్షల ప్రైజ్ మనీ 110 మందికి అందజేస్తున్నట్టు తెలిపారు. రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.9వేల 900 చొప్పున బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఇందుకు ప్రయాణికులు టిక్కెట్ వెనుక పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు.

## భారీగా మద్యం పట్టి వేత



**నవతెలంగాణ-ఇచ్చోడ**

మండల కేంద్రంలో అక్రమ బెల్ట్ షాపులపై పోలీసుల ఉక్కు పాదం మోపారు. మండల కేంద్రంలో పలు బెల్ట్ షాపులపై ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేష్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. సుమారుగా రూ.1 లక్ష 96 వేల విలువ గల మద్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి ప్రకారం బెల్ట్ షాపులపై సోదాలు నిర్వహించామని అన్నారు. ఇచ్చోడలోని పలు షాపులపై, అదే విధంగా జామిడి గ్రామంలో సోదాలు నిర్వహించామని తెలిపారు. ఈ సోదాల్లో సుమారుగా రూ. 1లక్ష 96 వేల అక్రమంగా నిలువ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలపారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

**బజార్‌హత్నూర్ :** మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించి, నిల్వ ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ భీమేష్, ఎస్సై నరేష్‌లు తెలిపారు. గురువారం మండలంలోని పిప్రి, గిర్నూర్, దేగామ, చందునాయక్ తండా, తదితర గ్రామాల్లోని బెల్ట్ షాపులను తనిఖీ చేశారు. పట్టుకున్న మద్యాన్ని సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్టు వారు పేర్కొన్నారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తులకు జరిమానా

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

కులం పేరుతో దుషించిన 5 గురు వ్యక్తులకు జరిమాన విధిస్తూ ఎస్పీ, ఎస్టీ కోర్టు జడ్జీ డా.శివరాం ప్రసాద్ గురువారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... 2020 సంవత్సరంలో జైనథ్ మండలంలోని గూడ గ్రామానికి చెందిన నిమ్మల ప్రభాకర్ అదే గ్రామానికి చెందిన ఎద్దుల వినోద్, నెమ్మది శ్రీధర్, నెమ్మది శ్రీపతిరావ్, షేక్ హుస్సెన్‌తో పాటు పరమేష్ నిమ్మల ప్రభాకర్‌ను కులం పేరుతో దూషించి అతనిపై దాడి చేశారు. దీంతో బాధితుడు జైనథ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసులో సీడీఓ జమీర్ 11 మంది సాక్షులను ప్రవేశ పెట్టగా పీపీ ఈ కిరణ్ కుమార్‌రెడ్డి వాధించి నేరం రుజువు చేయడంతో 5 గురు నేరస్తులకు ఒక నెల జైలు శిక్ష లేదా ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు లైజన్ అధికారి తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో అమృత కలశ యాత్ర

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమృత కలశ యాత్ర బ్లాక్‌స్థాయి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వారి వారి ప్రాంతాల్లో నుంచి సేకరించిన మట్టిని కలశాలలో ఉంచి ఎన్ఎస్ఎస్ పీఓల ద్వారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్ అందజేశారు. అనంతరం పంచ్ ప్రణ్ ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు దయాకర్, అష్రఫ్ అలీ, అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, రఘునాథ్, అనిత, ప్రతాప్ సింగ్, జ్యోత్స్న, నర్సింగ్‌రావు, వాలంటీర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనాలకు నెంబర్ ప్లేట్‌లు సరిగ్గా కలిగి ఉండాలి



**నవతెలంగాణ-ఇంద్రవెల్లి**

వాహనదారులు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్‌లు సరిగ్గా కలిగి ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. గురువారం పలు వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సంధ్బంగా పలు ద్విచక్ర వాహనదారులు నెంబర్ ప్లేట్లలో తక్కువ నెంబర్‌లు ఉండటం సరిగ్గా నెంబర్లు లేక పోవడంతో, వాటిని గుర్తించి, 15 వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.నిబంధనాలు పాటించని వారిపై చర్యలుంటాయని స్పష్టం చేశారు.

# పోలీసుల ముమ్మర తనిఖీలు

● పట్టుబడుతున్న మద్యం, డబ్బు

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకొలి గ్రామంలో గురువారం ఎక్సైజ్ శాఖ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న శ్రీనివాస్, శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రూరల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఇటువంటి విక్రయాలు మరోసారి చేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

**ఆదిలాబాద్‌టౌన్ :** జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, ఇచ్చోడ మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టులను ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అక్రమ మద్యం, గంజాయి లాంటి నిషేధిత వస్తువుల రవాణాను జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్, చెక్ పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.




**ఖానాపూర్ :** మండలంలోని మస్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సీఎం రావు ఫంక్షన్ హాల్ దగ్గరలోని ఓ కిరాణా షాపులో అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై లింబాద్రి తెలిపారు. కిరాణా షాపులో అక్రమంగా నిల్వచేసిన మందు బాటిళ్లను పట్టుకొని సీజ్ చేశామన్నారు. పట్టుకున్న మద్యం సీసాల విలువ రూ.11,860 ఉంటుందని అన్నారు.

**తాంసి :** భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామం సరిహద్దు ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో గురువారం తనిఖీ కేంద్రాన్ని ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్రర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనుమతి లేని మద్యం సరఫరా కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. మద్యంతో కానీ రూ.50వేలు మించి డబ్బులు తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్, సిబ్బంది ఉన్నారు.

# ఫలించిన యువజన కాంగ్రెస్ పోరాటం

**నవతెలంగాణ-బేల**

మండల కేంద్రంలో కబ్జా గురైన ఆర్టీసీ స్థలం ఎట్టకేలకు యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల పోరాటంతో తిరిగి ఆర్టీసీ అధికారుల ఆధీనంలోకి వచ్చిందని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కబ్జాకు గురవుతున్న బేల ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని కాపాడాలని అధికారులకు విన్నవించగా, చివరికి ఆర్టీసీ ఎండి సజ్జనార్‌ను కలిసి పరిస్థితిని వెల్లడించడంతో అధికార పార్టీ నాయకులు కబ్జా చేసుకున్న బేల ఆర్టీసీ బస్టాండ్ స్థలం తిరిగి అధికారుల ఆధీనంలోకి వెళ్లిపోయిందని తెలిపారు. ఇది ఎంతో సంతోషకరమని అన్నారు. దీనిపై స్పందించిన సజ్జనార్ ఆర్టీసీ స్థలాన్ని కాపాడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. వెంటనే దీనిపై దృష్టి సారించిన ఆర్టీసి అధికారులు ఎట్టకేలకు యువజన కాంగ్రెస్ నాయకుల పోరాటం ఫలితంగా స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని ప్రహరీ గోడను నిర్మించే పనులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్, మాజీ ఎంపీపీ బాపురావు హుల్కే, సంజీవ్ గుండావార్, అఖిల్, మడావి చంద్రకాంత్, బోక్రే శంకర్, ప్రమోద్ పాల్గొన్నారు.



## 15న పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

హైదరాబాదులోని సీఎంఆర్ కళాశాలలో ఈ నెల 15న పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, ఆడే ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జరుగుతుందని, సమావేశంలో రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణకై ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు పలు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ముందుకు సాగేలా, సీపీఎస్ రద్దు, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంటీఎస్, 317 జీఓ బాధిత ఉపాధ్యాయుల సమస్యలు, రూ.398తో పని చేసిన ఉపాధ్యాయులుకు నోషనల్ ఇంక్రిమెంట్ల గురించి, పీఆర్సీ, ఐఆర్ తదితర అంశాలను చర్చించి తీర్మానించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పీఆర్టీయూటీఎస్ ప్రాథమిక సభ్యులు, మండల, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

## సరైన ధృవీకరణ పత్రాలు లేని డబ్బులు సీజ్

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని కల్వాడ గ్రామం వద్ద గల అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద సర్కిల్‌లో సరైన ధృవీకరణ పత్రాలు లేని రూ.1.67 లక్షలను సీజ్ చేసినట్టు దహెగాం ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లికి చెందిన పడాల సుదర్శన్ బొలోరో వాహనంలో దహెగాంకు వస్తుండగా చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారం లేకుండా ఉన్న రూ.లక్ష67 వేలు తరలిస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైన డబ్బులు రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకురావొద్దని, ఒకవేళ తీసుకొచ్చినట్టయితే వాటికి సంబంధించి సరైన ఆధారాలు చూపించాలని లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తామన్నారు.

## సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు సెలవులను చదువులో నూతన మెళుకువలు నేర్చుకొని సద్వినియోగం చేసుకోవాలని ఇంటివద్ద జాగ్రత్తలు పాటించాలని డీఈఓ అశోక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులంలో ఏర్పాటు చేసిన ఇంపాక్ట్ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి తుకారాం బట్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ దసరా సెలవులలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సెలవులకి వెళ్లిన విద్యార్థులు ఆజాగ్రత్త వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పిల్లలని వాగులు, కొండల వద్దకి వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ సెలవుల అనంతరం 26వ తేదీ పిల్లలని ఎట్టిపరిస్థితుల్లో గురుకులం పంపించాలని కోరారు. విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు భాధ్యతగా మెలగాలన్నారు. సెలవులు వృదా చేయకుండా ఇంటి వద్ద విద్యార్థులు తమ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ పార్టనర్ నీతి అయోగ్ సూరజ్, సాయినాథ్, మని, తోటి సంఘం ఆత్రం సంతోష్, కొలాం సంఘం నాయకులు గంగారాం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బంకులో పనిచేసేందుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బంకులో పనిచేయడానికి ఆసక్తిగల యువతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీపో మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొని ఎంపికైన యువతులు పెట్రోల్ బంకులో వాహనాలకు పెట్రోల్ పోయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డిపోలో సంప్రదించాలని సూచించారు.

## బీజేపీలో పలువురు యువకుల చేరిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్(టి) మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన యువత గురువారం పెద్ద ఎత్తున బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. పట్టణంలోని పాల్వాయి హరీష్ నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి హరీష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిర్పూర్ మండలం బాగుపడాలంటే బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోహన్ నాయక్, బానోత్ ఇంద్రకర్, దుమ్మ ప్రవీణ్, బేతం మహేష్, నన్న పురుషోత్తం, గాండ్ల విలాస్, నన్న అంజయ్య, ధోని పురుషోత్తం, నన్న మహేష్, గాడి పురుషోత్తం, గాజిరెడ్డి శేఖర్, కమ్మరి మల్లేష్, నీరేటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి క్రీడోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి, విద్యార్థులకు జోనల్ స్థాయి క్రీడలు గురువారం జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు రమాదేవి జెండా ఊపి క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ క్రీడల వికాసానికి గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని జిల్లాకు వన్నె తేవాలని ఆకాంక్షించారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నవంబర్ 15, 16, 17 తేదీల్లో భద్రాది కొత్తగూడెం జిల్లాలోని ఐటీడీఏలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు వివరించారు. జోనల్ స్థాయి క్రీడల్లో 765 మంది గిరిజన బాల, బాలికలు పాల్గొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓలు ఆసిఫాబాద్, ఉట్నూర్ ఉద్దవ్, జగన్ ఏటీడీఓ క్షేత్రయ్య, పురుషోత్తం, కమ్మర్ హుస్సేన్ చిరంజీవి, స్పోర్ట్స్ ఆఫీసర్స్ మీనారెడ్డి, జీవరత్నం, జీసీడీఓ శకుంతల, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, పీజీ హెచ్‌ఎం డి.శ్రీనివాస్, గోపాల్ వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, కృష్ణమూర్తి, వినోద్, బిక్కు, ధనలక్ష్మి, వసతి గృహసంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సత్వర న్యాయం అందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదలకు సత్వర న్యాయం అందించే దిశగా కోర్టులు పనిచేయాలని లాయర్లు దానికి అనుగుణంగా విధులు నిర్వహించాలని జూనియర్ సివిల్ జడ్జి రవి తెలిపారు. కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న అనంతలక్ష్మి శిక్షణ నిమిత్తం వెళ్ళగా ఆమె స్థానంలో సిర్పూర్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న రవి అదనపు బాధ్యతలు స్వీకరించి బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సత్వర న్యాయం అందించినప్పుడే ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం బార్ అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్ బాబు, ప్రధాన కార్యదర్శి రాపర్తి రవీందర్, సీనియర్ న్యాయవాదులు ముక్త సురేష్, తాటిపల్లి సురేష్, జగన్ మోహన్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



ఆసిఫాబాద్ పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు పరీక్షలు మంగళవారం ముగియడంతో విద్యాసంస్థల్లో గురువారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బెండర లోని ఆదర్శ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ప్రిన్సిపల్ కనకయ్య అధ్యక్షతన తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంధ్యారాణి పాల్గొన్నారు. అదేవిదంగా ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, పీఈటీ తిరుపతి పాల్గొన్నారు.

**వట్టివాగు దిశా మోడల్ పాఠశాలలో**

మండలంలోని వట్టి వాగు దిశ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన వేడుకలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవోలు ఉద్ధవ్, జగన్, జీసీడీఓ శకుంతల, ఎస్సిఆర్పి రవీందర్, డీఆర్పీ వామన్ రావు, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ శంకర్, ప్రధానోపాధ్యాయుడు తుకారాం, మాధవరావు, రవి, సురేష్, గ్రామ కారొబార్ కైలాస్, జంగు గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు**

**కాగజ్‌నగర్ రూరల్ :** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం పెరగనిద్దాం, చదవనిద్దామని నినాదంతో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు త్రివేణి మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షతను రూపుమాపే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అమ్మాయిలపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొంటూనే ఐకమత్యంగా నిలవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఎస్ఎఫ్ఐ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి తుమ్మిడి భీమేష్ మాట్లాడుతూ బాలిక సాధికారిక విషయంలో ఎస్ఎఫ్ఐ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రకాష్, సాయికుమార్, నవీన్, ప్రవీణ్ సాయి కష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

**దహెగాం :** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయురాళ్లు విద్యార్థినిలతో కలిసి ఆటపాటలతో సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ నికాడి మల్లేష్, ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు, కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బెజ్జూర్ :** మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో బతుకమ్మలను తీరొక్క పూలతో పేర్చి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం శుక్రవారం నుండి దసరా సెలవులు ప్రకటించడంతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ ఉత్సవాలు జరుపుకున్నారు. అనంతరం మండలంలోని సమీప వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



కాగజ్‌నగర్‌లో విద్యార్థుల బతుకమ్మ సంబరాలు



దహెగాంలో విద్యార్థుల బతుకమ్మ సంబరాలు



బెజ్జూర్‌లో విద్యార్థుల బతుకమ్మ సంబరాలు

## పత్తి కొనుగోలుకు సీసీఐ, జిన్నింగ్ మిల్లులు సిద్ధంగా ఉండాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. గురువారం అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోలు కార్యక్రమం ప్రారంభం కాబోతున్న సందర్భంగా కొనుగోలుదారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పత్తి దిగుబడి ఇతర రాష్ట్రాలకు తరలించడం కానీ, దిగుమతి చేసుకోవడం కానీ అనుమతి లేకుండా, ఆ దిశగా రవాణా శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిన్నింగ్ మిల్లులలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తూనికలుకొలతల అధికారులు ఎలక్ట్రానిక్ కాంటాలను తనిఖీ చేయాలని, రైతులు తమ ఆధార్ అనుసంధానం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, కొండపల్లి, జైనూర్, కౌటాల ప్రాంతాలలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కొనుగోలు కేంద్రాల పరిధిలో 16 మిల్లులను గుర్తించడం జరిగిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కనీస మద్దతు ధరతో లబ్ధి పొందాలని తెలిపారు. జిల్లాలో అధిక శాతం పత్తి పంట సాగు చేస్తున్న నేపథ్యంలో రైతులకు కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షలో మార్కెటింగ్ అధికారి గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి గంధం లక్ష్మి, సీసీఐ, అగ్నిమాపక శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అభ్యర్థుల ఖర్చుల వివరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో పోటీ చేయే అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం ఎన్నికల అకౌంటింగ్ టీం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 3న నోటిఫికేషన్, 10న నామినేషన్, 13న నామినేషన్ల పరిశీలన, 15న అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు. జిల్లాలోని 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గంలో జరగనున్న ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలు అన్నింటిని వీడియో సర్వేయలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి పరిశీలిస్తామన్నారు. వాటిని అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటింగ్ టీం నోడల్ అధికారి, డీటీఓ రాజేశ్వర్, అకౌంటింగ్ టీం అధికారులు పాల్గొన్నారు.

## కళాశాలలో అమృత కళశ యాత్ర

నవతెలంగాణ-దహెగాం

విద్యార్థులలో, యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు, అమరవీరుల త్యాగాలను గుర్తించేందుకు ఏర్పాటుచేయబడిన కార్యక్రమం మేరే మట్టి మేరా దేశ్‌లో భాగంగా గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమృత కలశ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ చైర్మన్ ప్రిన్సిపాల్ అమరేందర్, ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ అన్నారు. పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఉమ్మడి జిల్లా సెక్రెటరీ బాబురావు నేతృత్వంలో నిర్వహించిన అండర్-19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖలీల్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి 150 మంది వరకు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. దీనిలో ఎంపికైన వారు ఈనెల 17వ తేదీన సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణిస్తే క్రీడ రిజర్వేషన్ రెండు శాతం వర్తిస్తుందని తెలిపారు. అనంతరం ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి, సిర్పూర్ (యు) పీడీ ధర్మారావు, పీడీ సుదీప్, సాంఘిక సంక్షేమ గురుకుల పీఈటీ యాదగిరి, లక్షెట్టిపేట మహాత్మ జ్యోతిబాపూలే పీఈటీ కార్తీక్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలన



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్రంలో నవంబర్ నెలలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల కమీషన్ నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఓటర్లకు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ అన్నారు. గురువారం మండలంలో 26 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో సిర్పూర్ మండలకేంద్రంలో ఉన్న జడ్పీపీఎస్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ నాలుగు పోలింగ్ కేంద్రాల్లో గత ఎన్నికల సమయంలో సరైన వసతులు లేక ఉండేదని, వాటిని ఈ ఎన్నికల్లో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఎన్.రాజేశ్వర్, ఆర్ఐలు జుగాజీరావు, మోబిన్, ఇమ్రాన్ ఉన్నారు.

## నియోజకవర్గంలో బీజేపీదే గెలుపు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కారం కావాలంటే కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం బాగుపడాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు, పార్టీ సిద్ధాంతాలకు యువత ఆకర్షితులై బీజేపీని బలపరుస్తున్నారని, రాబోయే కాలంలో మరిన్ని చేరికలు ఉంటాయని, ఈసారి ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో ఘన విజయం సాధించాలంటే ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్ నాయక్, బానోత్ ఇంద్రకర్, ప్రవీణ్, మహేష్, పురుషోత్తం, విలాస్, అంజయ్య, ధోని, కమ్మరి మల్లేష్ పాల్గొన్నారు.

## టీజీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ) గోలేటి బ్రాంచ్ ఆధ్వర్యంలో మండలంలోని పులికుంట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై ఎంపీ రూరల్ ఫోన్ఆర్ఫ్ ఆర్గనైజేషన్ కర్నూల్ కళాజాత బృందం బ్యాంకు పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు పథకాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై కళాజాత బృంధం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ విశ్వప్రసాద్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్ పలుగు, టీపీఎస్ ఇమ్రాన్, రాజు, ఐకేపీ శ్రీనివాస్, జనార్ధన్, కళాజాత బృందం సభ్యులు, మెజీషియన్ ఎన్ తేజ్‌కుమార్, డప్పు ప్లేయర్ వేణు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరళిన బీజేవైఎం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేవైఎం రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశానికి జిల్లా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులపై రాష్ట్ర నాయకత్వానికి వివరించినట్లు జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ వివరించారు. జిల్లాలో బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. ఆయనతో నాయకులు వికాస్, నవీన్, సాయి, విగ్నేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మంచిర్యాల
శుక్రవారం | అక్టోబర్ 13, 2023 | www.navatelangana.com

## జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థులు రాణించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థులు రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పీటీజీ ప్రిన్సిపల్ సురేష్ అన్నారు. ఈనెల 13 నుండి 15 వరకు మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగే గురుకులం జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నుండి విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## వాల్ రైటింగ్స్ తొలగింపు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుతో మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పార్టీలకు సంబంధించిన, పార్టీ రంగులు, పోస్టర్స్, వాల్ లైటింగ్‌లను యుద్ధ ప్రాతిపదికన సిబ్బందితో కలిసి గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ పర్యవేక్షణలో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-తాండూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ పి.సదయ్య పరిశీలించారు. గురువారం తాండూర్, అంకుశం, చౌటపల్లి పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో జరిగిన గొడవలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. అసాంఘిక, సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దని కోరారు. అక్కడి నుంచి మండలంలోని రేపల్లెవాడలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. వాహనల తనిఖీలో ఎలాంటి తప్పులు జగరకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించేల లభించిన డబ్బులు ఇతర సామాగ్రి, వాటిని స్వాధీనం చేసుకునే విధానం, తదుపరి చర్యల గురించి సిబ్బందికి వివరించారు. ఆయన వెంట తాండూర్ సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్సై ఎస్ రాజశేఖర్ ఉన్నారు.

## విలేఖరి వేదింపులకు గుడి పూజారి ఆత్మహత్యాయత్నం

### రూ.5 లక్షలు ఇస్తావా లేదా అని బెదిరింపు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఓ విలేఖరి వేదింపులకు తాళలేక స్థానిక రామాలయం గుడి పూజారి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చక్రవర్తి శర్మ స్థానిక రామాలయంలో పూజారిగా కొనసాగుతున్నారు. భక్తులకు ఉంగరాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో ఉంగురల విషయంలో ఓ మహిళతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయంపై స్థానిక రిపోర్టర్ మిట్టపల్లి సంతోష్ ఫోన్ చేసి మహిళతో జరిగిన ఆడియో తన వద్ద ఉందని పూజారికి తెలిపాడు. నేను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడి కూడా ఈ విషయం అన్ని పత్రికల్లో వస్తుందని, రూ. 5 లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేక పోతే పత్రికలోల వార్తలు వస్తాయని బెదిరించాడు. అతని వేధింపులు తాళలేక గురువారం ఉదయం తన ఇంట్లో ఉన్న 30 మాత్రలను వెనుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన కొలుకుటుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే విషయంలో స్థానిక పోలీసుల స్టేషన్‌లో కేసు నమోదైనట్టు ఎస్సై తెలిపారు.

## రైతులకు రూ.5 లక్షల రుణం అందిస్తాం



నవతెలంగాణ-జన్నారం

రైతునేస్తం ద్వారా రైతులకు రూ.5 లక్షల వరకు రుణం అందిస్తామని మండలం కిష్టాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఫణీందర్ రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు కిష్టాపూర్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. బ్యాంక్ సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా గృహ, వ్యాపార, బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, బ్యాంకు ఖాతాదారులు, రైతులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయి

### బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ని మరోసారి గెలిపిస్తాయని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని మురిమడుగు, వెంకటాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ బీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. బీఆర్ఎస్‌ని మరోసారి అధికారంలోకి తేవడానికి, ప్రతి కార్యకర్త నాయకుడు పట్టుదలతో కృషి చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ,కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, నాయకులు ఫజల్ ఖాన్, కోఆప్షన్ సభ్యులు మున్వర్‌అలీ ఖాన్, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, గద్దల పవన్ పాల్గొన్నారు.

# క్రీడా పోటీలకు సిద్ధమైన సీఓఈ క్రీడామైదానం

తెలంగాణ-తాండూర్





విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఐనాల సైదులు

తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) బెల్లంపల్లి క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి నిర్వహించే క్రీడా పోటీలకు మైదానం సిద్ధమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఐనాల సైదులు మాట్లాడుతూ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం ఒలంపిక్స్ క్రీడలే లక్ష్యంగా విద్యార్థులకు జోనల్ స్థాయి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అక్టోబర్ 13 నుంచి 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా 20 క్రీడ వేదికల మీద జోనల్ లెవెల్ లో ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. జోన్ వన్ (కాళేశ్వరం జోన్)కు సంబంధించిన కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల ,పెద్దపల్లి, ములుగు జిల్లాలకు సంబంధించిన బాలురకు బెల్లంపల్లి సీఓఈలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. మొత్తం 11 అంశాలలో అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకోసం బెల్లంపల్లి సీఓఈ క్రీడా మైదానంను గత 15 రోజుల నుంచి ఏర్పాట్లు చేశామన్నారు. 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ శాశ్వత నిర్మాణం చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఫుట్బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్, ఖోఖో వంటి క్రీడాంశాలకు సంబంధించిన కోర్టులను ప్రత్యేకంగా నిర్మించినట్లు ఆయన తెలిపారు. వీటితోపాటు అథ్లెటిక్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. అదే విధంగా షార్ట్పుట్, డిస్కస్ త్రో వంటి క్రీడల కోసం కోర్టులను సిద్ధం చేశారు. అదేవిధంగా ఈ క్రీడా పోటీలకు హాజరయ్యే సుమారు 1200 మంది విద్యార్థులకు వసతి భోజన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## సోలార్ పవర్ ప్లాంట్ పనులను పరిశీలించిన ఏరియా జీఎం



సోలార్ పవర్‌ప్లాంట్ పనులను పరిశీలిస్తు సింగరేణి అధికారులు

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ పట్టణంలో త్వరలో ప్రారంభించబోతున్న సోలార్ పవర్ ప్లాంట్ పనులను గురువారం ఏరియా జనరల్ మేనేజర్ బి శ్రీనివాస్‌రెడ్డి సోలార్ జనరల్ మేనేజర్ జానకి రామ్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్న టెన్ రిచ్ ఎర్త్ కంపెనీ అధికారులతో ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి ఎన్టిపిసియల్‌కు సోలార్ పవర్ను అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే చెన్నూర్ వన్ ఇన్‌క్లైన్ వద్ద 27.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ టెండర్ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎస్టీపీపీ బసివి రెడ్డి, జనరల్ మేనేజర్ వర్క్ షాప్స్ ప్రిహ్లాడ్, ఏజీఎం ఈ అంగ్ ఎం కార్పొరేట్ కుమార్, ఎస్ఓ టూ డైరెక్టర్ కేవీ రావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రసార సాధనాలను తొలగించండి

నవతెలంగాణ-తాండూర్





ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున వివిధ రాజకీయ పార్టీలు తమ ఉనికిని చాటుకునేందుకు ఏర్పాటుచేసిన ప్రసార సాధనాలను తొలగించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ లో భాగంగా రేచిని గ్రామపంచాయతీని సందర్శించారు, గ్రామంలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ పేపర్స్, ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పెయింటింగ్స్ గాని పబ్లిక్ ప్లేస్‌లలో ఉండరాదని, ఉంటే ఎప్పటికప్పుడు తీసివేయాలని గ్రామ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా రేచిని గ్రామంలో గల సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనము, క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, బారేపల్లి రైతు వేదికలను సందర్శించారు. పల్లె ప్రకృతి వనంలో గడ్డి, పిచ్చి మొక్కలు ఉండకుండా చూసుకోవాలని చనిపోయిన మొక్కల ప్రదేశంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పంచాయితీ ట్రాక్టర్ ద్వారా తడి పొడి చెత్తను సేకరించి వేరుచేసి డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేయడానికి వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ ఉన్నారు.

# ముందస్తు బతుకమ్మ సంబరాలు



భీమారం : పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. విద్యార్థి విద్యార్థులంతా సాంప్రదాయ బతుకమ్మ ఆట ఆడుతూ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు సాంప్రదాయ క్యాట్ వాక్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ చదువుతోపాటు ఆటపాటలు కూడా పాఠ్యప్రణాళికలో భాగమేనని తెలియజేశారు. చదువును అశ్రద్ధ చేయరాదని, సెలవులను సద్వినియోగపరుచుకోవాలని చదువును కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలని హితబోధ చేశారు. క్యాట్ వాక్‌లో ప్రథమ బహుమతి ఆదిత్య 6 వ తరగతి, ద్వితీయ బహుమతి లక్ష్మణ్ 9వ తరగతి, బాలికల విభాగంలో ఐశ్వర్య ప్రథమ బహుమతి, రమ ద్వితీయ బహుమతి, నసీమ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట స్కూల్ హెచ్‌ఎం సాంబమూర్తి, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, కృష్ణ గోపాల్, జ్యోతి, మాధవిలత, అర్చన అనసూయ పాల్గొన్నారు.



జన్నారంలో..

**భీమారం :** ముందస్తు బతుకమ్మ సంబురాలు మండలంలోని వివిధ పాఠశాలలో ప్రారంభం అయ్యాయి. ఎంగిలి పూల అమావాస్యతో తొమ్మిది రోజులు బతుకమ్మ వేడుకలు జరుగనుండగా పాఠశాలలకు రెండురోజుల ముందే సేలవులు ప్రకటించారు. దీంతో గురువారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మను పేర్చి ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బతుకమకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల నుంచే పండుగల విశిష్టతలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలపై గౌరవం పెంపొందించేందుకు సెలవులకు ముందు రోజున ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ విశ్వంబర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**జన్నారం :** మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. గురువారం మండలంలోని కలమడుగు వివేకానంద, స్లెట్, లిటిల్ హాండ్స్, ప్రయివేటు పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడి సంబరాలు నిర్వహించారు. నేటితో దసరా సెలవులు ప్రారంభం కావడంతో విద్యార్థులు ముందస్తు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సంబరాలలో కలమడుగు వివేకానంద పాఠశాల ప్రిన్సిపల్ అమరకొండ సతీష్, స్లేట్ పాఠశాల ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, లిటిల్ హాండ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్ పాల్గొన్నారు.



కాసిపేటలో..

## రేపల్లెవాడ చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష పట్టివేత





నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేపల్లెవాడ వద్ద ఏర్పాటుచేసిన ఇంటర్ డిస్టిక్ ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్ద తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహిస్తుండగా సిర్పూర్(టి) నుంచి హుండాయ్ క్రెటా టీఎస్ 20 డి 5445 అను వాహనంలో మదిరే అంజయ్య అనే వ్యక్తి సిర్పూర్(టి) అనువ్యక్తి చెన్నూర్‌కి వెల్తుండగా ఎటువంటి ఆధారాలు లేని రూ.లక్ష నగదును తన వెంట ఉంచుకున్నాడు. అట్టి డబ్బులకు సంబంధించి ఎటువంటి పత్రాలు చూపించనందున ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించగా, నల్లాల వినయ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తమ బృందంతో కలిసి ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో తాండూర్ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ప్రజలకు పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామంలో గురువారం మాజీ సర్పంచ్ నంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్ ఆధ్వర్యంలో 110వ రోజు గడప గడపకు కాంగ్రెస్ పథకాలు చేర్చే కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నూకల రమేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 6 గ్యారెంటీ కార్డులు వల్ల మహిళలకు ప్రజలకు ఉపయోగపడే పథకాలు ఉన్నాయని, మహిళలందరికీ రూ.2500, రూ.500 గ్యాస్, రైతులకు ఉపయోగపడే పథకాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇండ్లులేని వాళ్లందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తా అని మోసం చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మరాఠి శంకర్, బీసీ సెల్ నాయకులు రాయలింగు, బాణయ్య, రాజయ్య, యువజన కాంగ్రెస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు ఎండీ నయీమ్, నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెవెళ్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీజన వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-భీమిని

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామీణ ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎం అండ్ హెచ్‌ఓ సుబ్బారాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని సబ్ సెంటర్ల పరిధిలో గల గ్రామాల్లో ప్రజలకు రీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఫీవర్ సర్వే చేపట్టి జ్వరాలను నిర్ధారణ చేసి తగిన మందులను అందించాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత తో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి కృష్ణ, ఫార్మసిస్టు కలీం ఉమాశంకర్, శ్రీనివాస్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉట్నూరు ఆర్డీఓను కలిసిన తహసిల్దార్

నవతెలంగాణ-జన్నారం

ఉట్నూర్ ఆర్డీఓ జీవాకర్ రెడ్డిని మండల నూతన తహసీల్దార్ వేణుగోపాల్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశాలరు. ఆయన చాంబర్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జీవాకర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పగడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు.

